
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 31 । జనవరి । 2024

యర్రగుంట్లలో వేటగాడు

నిడుజివ్వి గ్రామ పరిధిలోని నాపరాయి గనులలో తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న వెట్టయన్ (వేటగాడు) సినిమా షూటింగ్ మంగళవారం జరిగింది.

- 8లో





తాయిలాల కోసం విమర్శలా..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చే తాయిలాల కోసం సొంత అన్నను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం 15.8 – 31.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఎస్సార్పీగా చెరుకూరు శ్రీనివాసులు



వేంపల్లె : స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పీజీటీగా పనిచేస్తున్న చెరుకూరు శ్రీనివాసులు స్టేట్ రీసోర్స్ పర్సన్(ఎస్సార్పీ)గా మంగళవారం నియమించారు. ఈ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ పథకం రాష్ట్ర డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 20 నుంచి 23వ తేదీవరకు రాష్ట్ర బృందాలు లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(ఎల్ఐపీ) పర్యవేక్షణకు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 13 జిల్లాలకు సంబంధించి అన్ని సబ్జెక్టులకు ఎస్పార్పీలను నియమించారు. అందులో భాగంగా వైఎస్సార్ జిల్లా నుంచి తెలుగు సబ్జెక్టు ఎస్పార్పీగా సి.శ్రీనివాసులు నియమితులయ్యారు.

షోకాజ్ నోటీసులు జారీ

కడప సెవెన్‌రోడ్స్ : కులగణన–2024 కార్యక్రమంలో ఎన్యుమరేటర్లుగా నియమించబడిన కొందరు సచివాలయ ఉద్యోగులు సర్వేకు డుమ్మా కొట్టి వలంటీర్ల ద్వారా సర్వే నిర్వహిస్తున్న విషయం కలెక్టర్ దృష్టికి చేరింది. దీంతో వారికి షోకాజ్ నోటీసులను జారీచేశారు. వివరాలిలా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ అప్లికేషన్ ద్వారా సమర్థవంతంగా కులగణన నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. సర్వేలో ప్రతి విభాగానికి వలంటీర్, సచివాలయ ఉద్యోగి ఈకేవైసీ తప్పనిసరిగా ఉండాలి. అయితే జిల్లాలోని పలు మండలాల్లోని సచివాలయ సిబ్బంది సర్వేలో పాల్గొనకుండా వారి బయో మెట్రిక్/ఆధార్ నంబరును వలంటీర్లకు అప్పగించి సర్వే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ సర్వేలో పాల్గొనని సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

కడప మార్కెట్ కమిటీ సెక్రటరీగా సుజాత

కడప అగ్రికల్చర్ : కడప మార్కెట్‌యార్డు సెక్రటరీగా సిద్దవటం మార్కెట్‌యార్డు సెక్రటరీగా పనిచేస్తున్న సుజాతకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆమె బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. కడప మార్కెట్‌యార్డు సెక్రటరీగా పనిచేస్తున్న బాల వెంకటరెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖలో సఖీ–వన్ స్టాప్ సెంటర్ పథకం కింద కాంట్రాక్టు పద్ధతి కింద భర్తీ చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తుల ఫారాలను ఫిబ్రవరి 3వ తేది సాయంత్రం 5 గంటల లోపు రాజంపేట–సుండుపల్లె మార్గంలోని కార్యాలయంలో అందజేయాలని కోరారు. http://kadapa.nic.in వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

చక్కని మెనూ.. ఎంచక్కా తిను!

నీళ్ల చారుకు కాలం చెల్లింది. అన్నం ఉడకలేదన్న మాట ఎప్పుడో మూగబోయింది. అవును.. మధ్యాహ్న భోజన తీరు మారింది. ఇప్పుడంతా సుచీ శుభ్రతకు పట్టం కట్టడం... నోరూరే వంటకాల్ని చేసి పెట్టడమే అధికారుల కర్తవ్యంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'జగనన్న గోరు ముద్ద పథకం' చక్కని మెనూతో.. ఏంచక్కా వేడి వేడిగా పిల్లల ముందు వాలిపోతోంది.

- జిల్లాలో పటిష్టంగా జగనన్న గోరుముద్ద పథకం
- మారిన మెనూతో ఇష్టంగా భోంచేస్తున్న విద్యార్థులు.



36 మండలాలు

2021 జిల్లాలోని పాఠశాలలు





చదువుతున్న విద్యార్థులు **1,37,314**

కడప ఎడ్యుకేషన్: అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అందులోనూ చిన్నారులు తినే ఆహారం వారి ఎదుగుదలతో పాటు బంగారు భవిష్యత్తును నిర్ణయిస్తుంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి విద్యార్థుల ఆకలి కేకలకు కారణమైంది. ప్రస్తుతం ఆ రోజులు మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజన నిర్వాహణ తీరే మారిపోయింది. నాడు తినలేక బయట పారబోసిన విద్యార్థులు నేడు ఒక్క మెతుకు కూడా వదలకుండా తింటున్నారు.



వరుసక్రమంలో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

డ్రాపౌట్లు నివారణతో పాటు, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాలలో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే... పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో గతంలో ఎన్నడూ చూడని మార్పులు చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంతో నూతన మెనూ రూపొందించి, పక్కాగా అమలు చేస్తున్నారు. రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ప్రస్తుతం వారానికి ఐదు సార్లు కోడిగుడ్డు అందిస్తున్నారు. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లు అదే వారంలో ఉపపయోగించేలా వాటిపై గుర్తులు వేస్తున్నారు.దీంతో పాటు వారానికి మూడు రోజులు రాగిజావ అందిస్తున్నారు. ఇలా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జగనన్న గోరు ముద్ద మెనూ

సోమవారం	: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ
మంగళవారం	: పులిహోరా, టమటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం	: వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం	: నిమ్మకాయ పులిహోరా, టమటా చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం	: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం	: ఆకుకూర అన్నం,పప్పు చారు, తీపి పొంగలి, రాగిజావ

పారదర్శకత.. పర్యవేక్షణ

జగనన్న గోరుముద్ద అమలు బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. వీరితో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా ప్రతి రోజూ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. ఆ తరువాతే విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. ఎంఈఓలు కూడా రోజూ తమ పరిధిలోని ఒక పాఠశాలను సందర్శించి,నాణ్యతను పరిశీలిస్తున్నారు.

పక్కాగా అమలు చేస్తున్నాం



ప్రభుత్వం పాఠశాలల్లో పిల్లలకు పౌష్టికాహారం కోసం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో రోజువారి మెనును ఖచ్చితంగా అమలు చేస్తున్నాం. అన్ని మండలాల ఎంఈఓలతోపాటు డిప్యూటీ ఈఓలు నిత్యం మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తున్నారు. నేను కూడా వారంలో నాలుగైదు రోజులు జిల్లాలో ఏదో పాఠశాలను సందర్శిస్తున్నా.

–రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

కడుపు నిండా భోంచేస్తున్నాం...



మా పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం చాలా బాగుంటుంది. రోజుకో మెనుతో భోజనాన్ని వడ్డిస్తున్నారు. దీంతోపాటు రోజూ చిక్కీ, కోడిగుడ్డును కూడా అందిస్తున్నారు. దీంతో నిత్యం కడుపునిండా తింటున్నాం. ఆనందంగా ఉంది.

– యామిని, 8వ తరగతి, మున్సిపల్ హైస్కూల్, కడప

537 మందిలో 520 మంది తింటున్నారు



మా పాఠశాలలో 537 మంది విద్యార్థులు ఉంటే అందులో రోజుకు 520 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారు. గతంలో ఇందులో 60 శాతం మంది మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని తినేవారు. ఇలాంటిది ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనుతో పిల్లలు చాలా ఇష్టంగా తింటున్నారు.

– మేరీ, ప్రధానోపాధ్యాయురాలు, చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్, కడప.

పిల్లల కోసం పౌష్టికాహారం..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం అవసరమని భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారించారు. పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రోజుకో మెనూను అందిస్తున్నారు. దీంతోపాటు చిక్కీ, కోడిగుడ్డును కూడా అందిస్తున్నారు. దీంతో పిల్లలో రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉండటంతో పాటు హుషారుగా ఉంటున్నారు.

– వెంకట క్రిష్టారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

సచివాలయాలతో పాలన చేరువ

కలెక్టర్ విజయరామరాజు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన ప్రజలకు మరింత చేరువైందని కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని వనంపుల పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలను ఇస్తోందని అన్నారు.

రాష్ట్రంలో మొదటి స్థానంలో బద్వేలు..

సచివాలయ భవనాల నిర్మాణంలో రాష్ట్రంలోనే బద్వేలు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన 203 సచివాలయాలకు పూర్తిస్థాయిలో సచివాలయ భవనాలు నిర్మించడంతో ఈ ఘనత దక్కిందని అన్నారు. ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు, డీఈ, ఏఈలను ఆయన అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెరవేరుతోందని అన్నారు. తొలుత ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తిరువెంగళాపురం సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి, ఆర్డీఓ ఆకులవెంకటరమణ, పీఆర్ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, ఎంపీపీ బిజివేములరమణమ్మ, జెడ్పీటీసీ పోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, పెద్దపోలిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చిన్నసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

'ప్రాక్టికల్స్'కు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి సూచించారు. మంగళవారం కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్లో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్ పరీక్షలు జరిగే తరగతి గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ల్యాబ్‌కు సంబంధించిన మెటీరియల్ పూర్తి వివరాలతో సిద్ధంగా ఉంచాలని సూచించారు. డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఈఐసీ మెంబర్స్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఆర్‌జేడీ, డీవీఈఓ, ఆర్ఐఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి

సర్వేశ్వరుడే కాపాడాలి

- తెలుగుతమ్ముళ్లను వెంటాడుతున్న టికెట్ ఫీవర్
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అభ్యర్థుల ఎంపికకు టీడీపీ రహస్య సర్వే
- సీఎం స్వంత జిల్లాలో దీటుగా నిలిచేవారి కోసం ప్రత్యేక అన్వేషణ
- భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న ఆశావహులు

సాక్షి ప్రతినిధి, కడప : ఉమ్మడి కడప జిల్లాలో తెలుగుతమ్ముళ్లకు టికెట్ ఫీవర్ పట్టుకుంది. పా ర్టీని నమ్ముకున్న వారిని కాదని, సీజనల్ నాయకులకు తెరపైకి తెస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. పార్టీ జెండా మోసినోళ్లకు గుండు సు న్నా చూపెట్టి, డబ్బునోళ్లదే పైచేయి అన్న రీతి లో చిన్నబాబు, పెద్దబాబు వ్యవహరిస్తున్నా రని రగిలిపోతున్నారు. ఈ క్రమంలో భవిష్యత్ ప్రణాళికకు కార్యాచరణ దిశగా కొందరు అడుగులు వేస్తుంటే, మరికొందరు టికెట్ దక్కినా ముళ్ల కిరీటమే, ఓడిపోయే స్థానం కోసం ఆరాటం ఎందుకనే దిశగా ఆలోచనలో పడ్డారు.

నియోజకవర్గ స్థాయిలో ఏకనాయకత్వం ఉన్న చోట కూడా అభ్యర్థుల ఎంపికలో ఇప్పటికీ టీడీపీ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించలేదు. అందుకు కారణం ఎన్నికల పొత్తులపై సమీకరణలని టీడీపీ అధిష్టానం చెప్పుకుంటున్నా, డబ్బు సంచులు అవలీలగా తెచ్చేవారి కోసమే ప్రత్యేక దృష్టి పెట్టారని తెలుగుతమ్ముళ్లు భావిస్తున్నారు. సీనియారిటీ, సిన్సియారిటీలను పరిగణలోకి తీసుకోకుండా పార్టీ టికెట్ కోసం బహిరంగ బేరాలు పెడుతున్నారని ఆశావహులు గగ్గోలు పెడుతున్నారు.

వ్యక్తిగత బలంపై బేరీజు వేస్తూ రహస్య సర్వే

టీడీపీ ఆశావహుల వ్యక్తిగత బలంపై టీడీపీ రహస్య సర్వే చేస్తోంది. పార్టీ జెండా మోసిన నేతల కంటే, డబ్బు సంచులు తెచ్చే నేతలు బెటరా.. ఎవరి పరిస్థితి నియోజకవర్గంలో ఎలా ఉంది అన్న విషయమై అధినేత చంద్రబాబు నివేదికలు తెప్పించుకుంటున్నారు. అధినేత మనసులో ఉన్న నేత, ఫీల్డ్‌లో ఉన్న నేత ఇరువురినీ బేరీజు వేస్తూ సమాచారం సేకరిస్తున్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. ఆ మేరకే ఇప్పటి వరకూ సింగిల్ నాయకత్వం ఉన్న జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల అభ్యర్థుల ప్రకటన కూడా చేయలేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఎస్సీ నియోజకవర్గాలు మినహాయిస్తే రాజంపేట, రాయ చోటి, కడప, ప్రొద్దుటూరు, మదనపల్లె నియోజకవర్గాల్లో బహునాయకత్వం ఉంది.

భవిష్యత్ ప్రణాళికల దిశగా అడుగులు

టీడీపీ టికెట్ దక్కించుకొని మరోమారు భవిష్యత్ పరీక్షించుకునేందుకు సిద్ధమైన సీనియర్ నేతలకు అధిష్టానం వైఖరి మింగుడుపడటం లేదు. పార్టీ కోసం పనిచేసిన, పార్టీనే నమ్ముకున్న వారిని కాదని పక్కచూపు చూస్తుండటంపై కొందరు విసుగు చెందారు. భవిష్యత్ ప్రణాళికల దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.ఈ మేరకు రాయచోటికి చెందిన ఓ నాయకు డు మండలానికి రెండు సమావేశాలు చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి 'ఇరవై ఏళ్లుగా మీతోనే ఉన్నాను, పార్టీ కోసమే పనిచేశాను. తాజాగా నన్ను కాకుండా మరో నాయకుడి వైపు పార్టీ చూస్తోంది. నన్నేమి చేయమంటారు. ఇక్కడే ఉండాలా.. ఉంటే మీరంతా నావెంటే ఉంటారా.. తేల్చి చెప్పాలి' అంటూ కార్యకర్తలను కోరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ మేరకు టీడీపీ అభ్యర్థుల ఎంపిక చేపట్టగానే కార్యచరణ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితి అటు అన్నమయ్య, ఇటు వైఎస్సార్ జిల్లాల్లో మరిన్ని నియోజకవర్గాల్లో ఉన్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు.

పురి విప్పిన మయూరం..
పునరుత్పత్తికి వరం

- ఇడుపులపాయలో నెమళ్ల పార్కు అభివృద్ధి
- పెరిగిన సందర్శకుల తాకిడి
- టీడీపీ హయాంలో ఫారెస్టు గెస్ట్‌హౌస్‌గా మార్చే యత్నం
- నాడు 'సాక్షి' కథనంతో వెనక్కి తగ్గిన బాబు
- నెమళ్ల సంరక్షణ కోసం అడుగులు వేసిన వైఎస్సార్



పురివిప్పి నాట్యమాడుతున్న మయూరం



నెమళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కడప సిటీ : జాతీయ పక్షిగా నెమలికి మన దేశంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. అటవీశాఖ నిబంధనల మేరకు జాతీయ జంతువు పులికి ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో అంతే ప్రాధాన్యతను నెమలికి కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అడవుల్లో నెమళ్ల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో ఎంతో శ్రద్ధతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఇడుపులపాయలో నెమళ్ల పార్క్(పునరుత్పత్తి కేంద్రం) ఏర్పాటు చేశారు. మయూరాల సంరక్షణకు శ్రీకారం చుట్టారు.

నెమళ్ల పార్కు ఎత్తేసేందుకు బాబు యత్నం

వైఎస్సార్ మరణం తర్వాత ఇడుపులపాయలో ఉన్న నెమళ్ల పునరుత్పత్తి కేంద్రం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఒకానొక సందర్భంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ఇడుపులపాయలో ఉన్న నెమళ్లపార్కు వల్ల ఎక్కడ వైఎస్సార్‌కు మంచి పేరు వస్తుందని, సందర్శకులు ఇక్కడికి వచ్చినపుడు పదేపదే ఆయన పేరును తలుచుకుంటూ ఉంటారనే దురుద్దేశ్యంతో ఇక్కడ ఉన్న నెమళ్ల పార్కును పూర్తిగా ఎత్తివేసేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే 2016లో ట్రిపుల్ ఐటీ కాన్వొకేషన్ కార్యక్రమానికి చంద్రబాబు వచ్చినపుడు అటవీశాఖ అధికారులను పిలిచి పునరుత్పత్తి కేంద్రం లేకుండా చేయాలని చర్చించారు.

వైఎస్సార్ హయాంలో ఏర్పాటు

2008 డిసెంబరు, 24న అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.50 లక్షల నిధులతో నెమళ్ల పార్క్‌కు బీజం వేశారు. అప్పట్లో దేశంలోనే ఏకైక నెమళ్ల పునరుత్పత్తి కేంద్రంగా ఇది నిలిచింది. ఓ ఆస్పత్రి, గుడ్లను పొదిగించేందుకు ఇంక్యుబేటర్, ల్యాబ్, షెడ్డును ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. అప్పుడు కొన్ని నెమళ్లను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ సంరక్షణను చేపట్టారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

'సాక్షి' కథనంతో వెనక్కి తగ్గిన బాబు

ఇడుపులపాయలో ఉన్న నెమళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని చంద్రబాబు ఎత్తివేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందించిన విషయాన్ని 'సాక్షి' గుర్తించింది. ఈ నేపథ్యంలో 'పాపం మయూరం' అనే శీర్షికన కథనం ప్రచురించడంతో చంద్రబాబు వెనక్కి తగ్గి నెమళ్లపార్కును కొనసాగించారు. అయితే టీడీపీ హయాంలో ఈ కేంద్రం అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. సంరక్షణను గాలికి వదిలేశారు. ఏడాదికి రూ 2.40 లక్షలు కేటాయించలేక పోయారు. దీంతో నెమళ్ల పునరుత్పత్తి కేంద్రానికి గడ్డు పరిస్థితి ఎదురైంది. ఎలాగోలా అధికారులే తిప్పలు పడి నెమళ్లపార్కు నిర్వహణను కొనసాగిస్తూ వచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యలు తీరిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ కేంద్రం సంరక్షణ సజావుగా కొనసాగుతోంది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రం నిర్వహణకు అధికారులు అన్ని చర్యలను చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం 12.50 హెక్టార్లలో ఉండగా, అందులో 41 నెమళ్లున్నాయి. కేంద్రంలో 21 మగ, 20 ఆడ నెమళ్లను సంరక్షిస్తున్నారు. విజయవాడ నుంచి ఈమా ఫీడ్‌ను తీసుకొచ్చి అందులో సొద్దలు, జొన్నలు, రాగులు, వేరుశనగ పప్పులు, పొద్దుతిరుగుడు విత్తనాలతో పాటు బొరుగులు కలిపి దాణాలాగా ఉదయం, సాయంత్రం వాటికి ఆహారంగా అందిస్తున్నారు.

సంరక్షణకు అన్ని చర్యలు



నెమళ్ల పార్కు సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్ర స్థాయిలో ఈ కేంద్రం నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి నెమళ్ల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నాం. సందర్శకుల తాకిడి కూడా ఇప్పుడు బాగా పెరిగింది. నెమళ్లు అనారోగ్యం బారినపడితే ప్రత్యేకంగా ఒక వైద్యుడిని రప్పించి వాటికి వైద్యం చేయించి కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సుబ్రమణ్యం, అటవీశాఖ అధికారి, వేంపల్లె

పెరిగిన సందర్శకుల తాకిడి

ఇడుపులపాయ ప్రాంతాన్ని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బాగా అభివృద్ధి చేశారు. ఈ ప్రాంతంలోనే ఎకో పార్కు, ట్రిపుల్ ఐటీ ఏర్పడింది. ఆయన మరణం తర్వాత వైఎస్సార్ ఘాట్ కూడా ఇక్కడే నిర్మించారు. ఈ క్రమంలో వీటిని సందర్శించేందుకు ప్రజలు వచ్చినపుడు నెమళ్లపార్క్‌కు కూడా వెళ్లసాగారు. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. అంతేకాకుండా పుణ్యక్షేత్రమైన శ్రీ గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చిన భక్తులు కూడా ఈ నెమళ్ల పార్కును సందర్శించసాగారు. ప్రధానంగా చిన్న పిల్లలు ఈ నెమళ్ల పార్కును చూసినపుడు అవధుల్లేని ఆనందం పొందుతున్నారు. నేరుగా నెమళ్లను చూడటంతో పాటు అవి పురి విప్పి ఆడుతున్నపుడు పరవశించిపోతున్నారు.

అరుదైన పక్షులకు సరైన కేంద్రం

అడవిలో నెమళ్లు గుడ్లు పెట్టినపుడు వాటిని ఇతర జంతువులు తింటుండటంతో వీటి సంఖ్య తగ్గిపోయేందుకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో 2010 నుంచి 2014 వరకు ఆయా ప్రాంతాల్లో గుడ్లు సేకరించి ఇక్కడి ఇంక్యుబేటర్‌లో పొదిగించి సంరక్షించారు. కోళ్ల కింద కూడా గుడ్లు పెట్టి పొదిగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అడవిలోకి 150 నెమళ్లు



నెమళ్ల పునరుత్పత్తి కేంద్రం ప్రారంభంలో విజయవాడ నుంచి ఇక్కడికి నెమళ్లను తెప్పించి సంరక్షించేందుకు చర్యలు చేపట్టారు. ఆటుతర్వాత ఇప్పటివరకు మూడు విడతలుగా 150 నెమళ్లను అక్కడికి సమీపంలోని శేషాచలం అడవుల్లోకి అధికారులు వదిలారు.

క్లుప్తంగా

దాడి కేసులో ఐదుగురికి జైలు శిక్ష

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో 2017 సంవత్సరం ఫిబ్రవరి నెలలో బీంచెర్ల వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసిన కేసుకు సంబంధించి ఐదుగురికి మూడు నెలల జైలు శిక్ష లేదా ఒక్కొక్కరికి రూ.6 వేలు జరిమానా విధిస్తూ కమలాపురం కోర్టు మేజిస్ట్రేట్ ఎస్ లావణ్య తీర్పు ఇచ్చారు. ఈ మేరకు వివరాలను ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. 2017లో 17వ వార్డు కౌన్సిలర్ దివ్య ఇంటి వద్ద జరిగిన గొడవలో జి.రాజగోపాల్‌రెడ్డి, సి.సుధీర్‌రెడ్డి, ఎం. నర్సింహులు, ఎం.జనార్దన్, రాజేశ్వరరెడ్డిలు ఆ వార్డులో ఉండే బీంచర్ల వెంకటసుబ్బారెడ్డిపై దాడి చేశారు. దీంతో బాధితుడు ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ వెంకటనాయుడు కేసు నమోదు చేశారు. ఈ కేసును పూర్తిగా విచారణ చేపట్టారు. ప్రధాన ముద్దాయిలైన ఐదుగురికి మూడు నెలలు జైలు శిక్ష, లేదా ఒక్కొక్కరికి రూ.6 వేలు నగదు జరిమానా చెల్లించాలని కమలాపురం కోర్టు మేజిస్ట్రేట్ ఎస్.లావణ్య తీర్పు చెప్పారు. కమలాపురం ఏపీపీ తాజుద్దీన్, కోర్టు కానిస్టేబుల్ గంగాధర్‌రెడ్డిలు ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేశారు. కాగా, శిక్ష పడిన వారిలో రాజగోపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలు ఒకరు మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డికి తోడల్లుడు, మరొకరు కుమారుడు కావడం గమనార్హం.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో మంగళవారం అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మండలంలోని రాయగుడిపల్లి గ్రామంలో ఓ నివాసంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే మరోచోట అక్రమ మద్యం తరలిస్తుండగా దాడి నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాయిలాల కోసం సొంత అన్నను విమర్శించడం దారుణం

- తెలంగాణలో పార్టీ పెట్టి అక్కడి ప్రజలకు ద్రోహం చేశారు
- వైఎస్ జగన్ బీజేపీకి తొత్తు అనడం హాస్యాస్పదం
- షర్మిల వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు మండిపాటు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చే తాయిళాల కోసం సొంత అన్నను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటే అది కేవలం వైఎస్సార్ వల్లేనన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తన ఆలోచనల నుంచి మేనిఫెస్టో ప్రకటించి అమలు చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి పథకాలు వైఎస్సార్ రూపొందించినవేనన్నారు. 2009లో కూడా ఎవరితో పొత్తు లేకుండానే 153 అసెంబ్లీ, 33 ఎంపీ సీట్లు సాధించి రెండోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారన్నారు. వైఎస్సార్ మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీ వైఎస్ కుటుంబంపై కక్ష గట్టిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పొమ్మనలేక పొగబెట్టి బయటకు పంపిందన్నారు. 2014లో వైఎస్సార్ పేరును చార్జ్‌షీట్‌లో చేర్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందన్నారు. అప్పుడు షర్మిల పాదయాత్ర చేసి పార్టీకి చేదోడు వాదోడుగా ఉన్నారన్నారు. దీనివల్ల ఆమెపై తమకు గౌరవం, అభిమానం ఉన్నాయన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే తాయిళాల కోసం సొంత అన్నను విమర్శిస్తుంటే ఆమె విషయంలో జాలిపడాలో, బాధపడాలో తెలియడం లేదన్నారు. తెలంగాణలో పార్టీ పెట్టి అక్కడి ప్రజలకు ద్రోహం చేశారని, ఇక్కడికొచ్చి ఇది నా పుట్టినిల్లు అంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీజేపీకి తొత్తు అనడం హాస్యాస్పదమన్నారు. దివంగత వైఎస్ఆర్ చేపట్టిన ప్రాజెక్టుల పనులు కాంగ్రెస్, టీడీపీ హయాంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత 0–18 కి.మీ కాలువ పూర్తి చేసి బ్రహ్మం సాగర్‌లో 18 టీఎంసీల నీరు నిల్వ చేశారని, గండికోట ముంపు వాసులకు రూ.1000 కోట్ల పరిహారం ఇచ్చి 26 టీఎంసీలు నీటిని నిల్వ చేశామన్నారు. ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసి కేంద్రం ఇవ్వాల్సిన అనుమతుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కడప– బెంగళూరు రైల్వేలైన్‌కు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదన్నారు. చంద్రబాబును అడగాల్సిన ప్రశ్నలు తమను అడగటం భావ్యం కాదన్నారు.

పులివెందులలో అభివృద్ధి జరగలేదని టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రానికే ఆదర్శంగా పులివెందులలో అభివృద్ధి జరుగుతోందని, మెడికల్ కళాశాల, ఐజీ కార్ల్, ఐటీ కారిడార్, సరికొత్త ఆర్టీసీ బస్టాండు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే వారి కళ్లకు కనిపించకపోవడం దారుణమన్నారు. పెద్దమనిషి అని సి.రామచంద్రయ్యకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే ఆయన ఇప్పుడు వైఎస్సార్‌సీపీని విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. పదవి తీసుకుని అనుభవించి ఎన్నికలు దగ్గర పడేసరికి పార్టీ మారి, విధి విధానాలు నచ్చలేదని చెప్పడం సరికాదన్నారు. ఆర్థిక నిపుణులు ఆశ్చర్యపోయేలా పథకాలు అమలు చేస్తున్నారని పొగిడిన ఆ నోటితోనే రాష్ట్రంలో అప్పులు పెరిగిపోయాయని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. చంద్రబాబు రాష్ట్రానికి అప్పులు మిగిల్చిపోలేదా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాపై తమ పార్టీ ఎంపీలు ప్రతి సమావేశాల్లోనూ అడుగుతున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మెజార్టీ ఉంది కనుకే తమను పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, కిరణ్, కార్పొరేటర్లు కె. సూర్యనారాయణరావు, మల్లికార్జున, అజ్మతుల్లా పాల్గొన్నారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

పాఠశాలల రూపురేఖలు మారాయి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టడం వలన విద్యార్థులకు అవసరమైన ఆధునిక వసతులు సమకూరాయి. నేను పని చేస్తున్న గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మొదటి విడతలోనే రూ.40 లక్షలు మంజూరయ్యాయి.

దీంతో పాఠశాలలో శిథిలావస్థకు చేరుకొన్న గదులను పునర్ నిర్మించడంతో పాఠశాల ఇప్పుడు కొత్తగా మారింది. నూతన గదులు, మరుగుదొడ్లు, తాగు నీటి కోసం మినరల్ ప్లాంటు, విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు, డిజిటల్ బోర్డులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాఠశాలలో గతంలో కంటే అడ్మిషన్ల సంఖ్య బాగా పెరిగింది. విద్యను అభ్యసించేందుకు పిల్లలు కూడా పోటీ పడుతున్నారు.

- శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జగనన్న విదేశీ విద్యాదీవెనతో చదువుకుంటున్నా



మాది ప్రొద్దుటూరు మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామం. మా తల్లిదండ్రులు రామలింగారెడ్డి, భాగ్యలక్ష్మి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నేను నాగపూర్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాను. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకున్నా. గత ఏడాది జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా ఎంఎస్ ఫైనాన్స్ కోర్సుకు దరఖాస్తు చేసుకోగా ఎంపికయ్యాను. మొత్తం రూ.64లక్షలు మంజూరు కాగా, తొలి విడతగా రూ.15.90 లక్షలు చెల్లించారు. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ అర్బానా, ఛాంపియన్‌లో చదువుతున్నాను. మా సోదరి తమిళనాడులో పీజీ ఎమర్జెన్సీ మెడిసిన్ చదువుతోంది. నాలాంటి వారెందరో ఈ పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.

- గోపిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి

వీరశివా.. ఖబడ్దార్!

- నీ వయసుకు తగినట్లు వ్యవహరించు.. నోరుంది కదా అని పారేసుకోవద్దు
- ఎప్పుడు ఏ పార్టీలో ఉంటావో నీకే తెలియదు
- బెట్టింగ్ నీ స్పెషల్ క్వాలిటీ.. నీవా నా గురించి మాట్లాడేది.?
- తీవ్ర స్థాయిలో మండిపడిన కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తన వయసుకు తగినట్లు పెద్దమనిషిలాగా వ్యవహరించాలని, నోరుంది కదా అని పారేసుకుంటే.. ఖబడ్దార్ అని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరశివారెడ్డి ఏ నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చాడో అందరికీ తెలుసన్నారు. ఇంట్లోనే పేకాట ఆడించడం, క్లబ్బులు నడపడం, మేజులు ఎత్తడం వారికి అలవాటని ఆరోపించారు. గతంలో సారా అంగళ్లు పాడుకోవడం, దొంగసారా తయారు చేయడం, దానిని కోగటంలో బాటిలింగ్ యూనిట్ పెట్టి అమ్మడం వంటి పనులు చేశారని ఆరోపణలు గుప్పించారు. మండల ప్రెసిడెంట్‌గా ఉండి అదృష్టం కొద్ది ఎమ్మెల్యే అయ్యారని, ఎమ్మెల్యేగా ఉంటూ పైరవీలు చేయడం, డబ్బు తీసుకొని ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు, వర్కులు అమ్ముకోవడం, దొంగగా ఇసుక ఎత్తడం వంటివి చేశారన్నారు. హైదరాబాద్, బెంగళూరులలో వాహనాలను దొంగతనం చేయించి, ఇక్కడికొచ్చి అమ్మడం చేశారని, దీనిపై హైదరాబాద్‌లో కేసు నమోదైందన్నారు. వైఎస్సార్ దయవల్ల దాన్నుంచి బయటపడ్డారని తెలిపారు. బెట్టింగ్ నిర్వహించడం వీరశివాకున్న స్పెషల్ క్వాలిటీ అన్నారు. ఏ భూముల్లో ప్లాట్లు వేస్తున్నా తాను అందులో భాగస్వామిగా మారిపోతారని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉండటం వీరశివాకు అలవాటన్నారు. వైఎస్ కుటుంబం సపోర్టుతోనే టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారని, రెండోసారి కాంగ్రెస్ టికెట్ కోసం బెంగళూరులో వైఎస్ జగన్ చుట్టూ ప్రదక్షిణలు చేశారని చెప్పారు. ఇప్పుడు ఎన్నికల దగ్గరపడే సరికి టీడీపీలో చేరి వైఎస్సార్‌సీపీపై, వైఎస్ జగన్, తనపై విమర్శలు చేయడం దారుణమన్నారు. తాను ఎక్కడ కబ్జాలు చేశానో చూపాలని సవాల్ విసిరారు. తాను భూములను డబ్బు పెట్టి కొన్నానే తప్పా అన్యాయంగా, అక్రమంగా దోచుకోలేదన్నారు. గతంలో కమలాపురం 8 అడుగుల రోడ్డు మాత్రమే ఉండేదని, ఇప్పుడు ఎలా ఉందో వెళ్లి చూడాలన్నారు. వీరశివా స్వంత గ్రామం కోగటంలో రూ.3కోట్లకు పైగా పనులు చేయిస్తున్నానని, సేతు బంధన్ కింద కమలాపురం రైల్వే వంతెనకు టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. కమలాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థిని 100 శాతం తానేనన్నారు. ఈసారి మళ్లీ హ్యాట్రిక్ సాధించేది కూడా తానేనని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కాంగ్రెస్ ఏం చేసిందో షర్మిలకు తెలియదు

కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో షర్మిలకు తెలియదని ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. షర్మిల వైఎస్సార్‌సీపీపై చేసిన విమర్శలపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ప్రత్యేక హోదాపై మాట్లాడుతోంది ఒక్క వైఎస్సార్‌సీపీయేనన్నారు. అవగాహన తెచ్చుకొని మాట్లాడాలని ఆయన షర్మిలకు సూచించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, 50వ డివిజన్ ఇన్‌చార్జి కె. రాజశేఖర్‌రెడ్డి, సీకేదిన్నె మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్


మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు అందిస్తున్న భారతి టెక్నికల్ ఇంజనీర్ నాగేంద్ర

కమలాపురం : అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని ఆ కంపెనీ జిల్లా టెక్నికల్ ఇంజినీర్ కె. నాగేంద్ర తెలిపారు. మంగళవారం కమలాపురంలో తాపీ మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే 60 మంది మేస్త్రీలకు రూ.1 లక్ష ఉచిత ప్రమద బీమా బాండ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిమెంట్ రోబోటిక్, జర్మనీ టెక్నాలజీతో తయారవుతుందని, భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మరింత నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఈ సిమెంట్ పర్యావరణానికి మరింత అనుకూలంగా ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ 5 గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రాఫాస్ట్ 2 గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. ఒక వేళ వర్షం పడే సూచనలున్నా ఈ సిమెంట్ వినియోగించ వచ్చన్నారు. ఈ సిమెంట్ చాలా దృఢత్వాన్ని కలిగి ఉంటుందని, కట్టడాలు త్వరగా పూర్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాసులు, డీలర్ నాగార్జున, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ల మండలం చల్లగిరిగెల పంచాయతీ వెంకటరామాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, ఓబులేసులు వరుసకు అన్నదమ్ములు. ఇరువురు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బేల్దారి పని నిమిత్తం బద్వేలుకు వచ్చి పని ముగించుకుని రాత్రి తమ ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా బైపాస్ రోడ్డులో టిప్పర్ ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా టిప్పర్ కింద పడి బైక్ నుజ్జునుజ్జు అయింది. వెంటనే స్థానికులు ఇరువురిని 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇరువురిని కడపకు తరలించారు.

రైలులో అక్రమ మద్యం స్వాధీనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైలులో అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కడప రైల్వే ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపారు. కడప రైల్వే ఇన్‌స్పెక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో క్రైమ్ పార్టీ సిబ్బంది రవిచంద్ర, సుబ్బయ్య, ఫైరోజ్, దేవదాస్‌లు దాడి నిర్వహించారు. ఈ మేరకు సీఐ మీడియాకు వివరాలు వెల్లడించారు.

గుంతకల్లు ఎస్ఆర్‌పీ చౌడేశ్వరీదేవి, తిరుపతి డీఎస్ఆర్‌పీ షేక్ షానుల ఆదేశాల మేరకు చెన్నై నుంచి పూణేకు వెళుతున్న రైలులో తనిఖీలు నిర్వహించి ఎనిమిది కొరియర్ నెపోలియన్, నాలుగు గ్రీన్‌లీఫ్ బ్రాందీ బాటిళ్లతోపాటు బుడ్వైజర్ బీర్ బాటిళ్లుగల రెండు టిన్‌లతో కలిపి మొత్తం 22 బాటిళ్లను సీజ్ చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

• ఎర్రగుంట్లలో 'వేటగాడు'

నాపరాయి గనుల్లో రజనీకాంత్ షూటింగ్


ఫైట్ సీన్ చిత్రీకరణ కోసం వస్తున్న సూపర్ స్టార్ రజనీకాంత్

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి గ్రామ పరిధిలోని నాపరాయి గనులలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న వెట్టయన్ (వేటగాడు) సినిమా షూటింగ్ మంగళవారం జరిగింది. లైకా ప్రొడక్షన్ సారథ్యంలో రజనీకాంత్ 170వ సినిమాను దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ విలన్‌తో మాట్లాడి ఫైట్ చేయడం చిత్రీకరించారు. అభిమానుల తాకిడి అధికంగా ఉండటంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, రజనీకాంత్‌కు సమీప సిమెంట్ పరిశ్రమ గెస్ట్‌హౌస్‌లో బస ఏర్పాటు చేశారు.

విగ్రహాల సంఘటన దురదృష్టకరం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు

కడప కల్చరల్ : కడప నగరం తహసీల్దార్ కార్యాలయం వెనుక దేవతా మూర్తుల విగ్రహాల తొలగింపు సంఘటన దురదృష్టకరమని, పరిస్థితి వెంటనే చక్కదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హిందూ సంఘాల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం వెనుకగల ప్రాంతాన్ని చదును చేయడంలో భాగంగా అక్కడున్న నాగులపుట్ట వద్దగల నవగ్రహాల్లో ఒకటి పగిలిపోవడంతో పాటు సమీపంలో ఉన్న శివలింగాలు, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను తొలగించారు. విషయం తెలుసుకున్న పలు హిందూ సంఘాలు, బీజేపీ, అనుబంధ సంఘాల వారు మంగళవారం ఉదయం 10.00 గంటలకు అక్కడికి చేరుకున్నారు. తాము ఎంత ప్రాధేయపడినా తహసీల్దార్ వినకుండా విగ్రహాలను కూల్చివేయడానికి కారకులయ్యారని, ఆయనపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తొలుత కడప ఆర్డీఓ మధుసూదన్ పరిస్థితిని పరిశీలించారు. జిల్లా అర్చక సమాఖ్య టెంపుల్ ప్రొటెక్షన్ మూమెంట్ అధ్యక్షుడు విజయభట్టర్ ఆయనతో మాట్లాడారు. అలాగే కడప డీఎస్పీ షరీఫ్, తహసీల్దార్ శివరామిరెడ్డి ధర్నా చేస్తున్న వారి వద్దకు వచ్చి విగ్రహాలను తొలగించడం, పగులగొట్టడం తమ అభిమతం కాదని, చదును చేయడంలో భాగంగా జరిగిన పొరపాటు వల్ల మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. వీటిని భక్తుల కోరిక మేరకు పునర్నిర్మించి పరిస్థితిని చక్కదిద్దగలమని హామీ ఇచ్చారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఆసుపత్రి సిబ్బంది తీరుపై బీసీ కాలనీ వాసుల ఆగ్రహం


ఆసుపత్రి ఎదురుగా బైఠాయించిన బీసీ కాలనీ వాసులు

జమ్మలమడుగు : ఆత్మహత్య చేసుకున్న మహిళ మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే విషయంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పట్టణంలోని బీసీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలిలా.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన బడిగించల దేవి అనే మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని మృతురాలి బంధువులు కోరగా చీకటి పడటంతో మంగళవారం నిర్వహిస్తామని ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. దీంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఫ్రీజర్‌లో కాకుండా బండపైన పెట్టడంతో మృతదేహానికి చీమలు పట్టి ఉబ్బిపోయింది. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం గుర్తించిన మృతురాలి బంధువులు ఆసుపత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ముందు బైఠాయించారు. ఫ్రీజర్ లేకపోతే తమకు చెబితే తాము తీసుకుని వచ్చేవాళ్లమని, ఇలా చేయడం సరైంది కాదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం సూపరింటెండెంట్ రఫిక్‌పాషాకు వినతిపత్రం సమర్పించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక


దువ్వూరు:పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


అట్లూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

దువ్వూరు : దువ్వూరులో మంగళవారం కటారు రాఘవేంద్ర, కటారు రఘు ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పార్టీ విధానాలు నచ్చి తమతోపాటు అర్థాకుల కృష్ణయ్య, బండి లక్ష్మీదేవి, బండి నాగేంద్ర, బండి రాజేష్, తోటా సుబ్బనారాయణ, యనమల పెద్ద సుబ్బరాయుడు, చిన్న సుబ్బరాయుడు, శెట్టిపల్లె మునెయ్యలతోపాటు 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఇరగం శంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగటం వీరారెడ్డి, జొన్నవరం వీరారెడ్డి పాల్గొన్నారు.

అట్లూరులో 40 కుటుంబాలు..

అట్లూరు : మండల పరిధిలోని కొండూరు ఎస్టీ కాలనీ నుంచి 40 కుటుంబాల వారు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సమక్షంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న వీరు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దున్నూతల బాలక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో బద్వేలులో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ మన్యం మల్లికార్జునరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో 35 కుటుంబాలు..


వీరపునాయునిపల్లె: వైఎస్సార్‌సీపీలో చేరిన గోనుమాకులపల్లె బీసీ కాలనీ వాసులు

వీరపునాయునిపల్లె : మండలంలోని గోనుమాకులపల్లె గ్రామం బీసీ కాలనీకి చెందిన 35 కుటుంబాల వారు మంగళవారం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుధాకర్, శ్రీకాంత్, రామాంజనేయులు, సుబ్బరాయుడు, మల్లేసు, బాలమునెయ్య, గంగాధర, బ్రహ్మయ్య, రాముడు, గంగయ్య, చంద్ర ఓబుల్ రెడ్డి, అంజనేయులు, మల్లేసు, మల్లికార్జున, గురుమోహన్, మునెయ్య, శివలక్ష్మి, ప్రశాంతి, పెద్ద ఈశ్వరయ్య, చిన్న చెంద్రాయుడు, పెద్ద చెంద్రాయుడు, చిన్న ఈశ్వరయ్య, చంద్రకాశి, ఓబులేసుతో పాటు మరో 11 కుంటుంబాల వారు పార్టీలో చేరారు. వీరందరికి మండల అధ్యక్షుడు పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. గోనుమాకులపల్లె సర్పంచు సురేంద్రకుమార్ యాదవ్, ఓబుల్‌రెడ్డిపల్లె సర్పంచు విజయ్‌కుమార్ యాదవ్, మండల బీసీ నాయకుడు ప్రతాప్ యాదవ్, స్థానిక నాయకులు గోవిందురెడ్డి, పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.